# ముఖ్యమంత్రి కార్యాలయము

## తెలంగాణ ప్రభుత్వం

పత్రికా ప్రకటన-1 22, డిసెంబరు, 2014

ప్రత్యక్ష,పరోక్ష ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు ప్రజలకు కావలసిన వస్త్ర సంబంధ ఉత్పత్తులన్ని ఒకే చోట లభించే విధంగా వరంగల్ టెక్స్‌టైల్ పార్క్ ఉండాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు ఆదేశించారు. దేశంలోని ఎక్కువ వస్త్ర ఉత్పత్తులు జరిగే సూరత్, షోలాపూర్, తిర్పూర్ లాంటి నగరాల్లో అధ్యయనం చేసి వరంగల్ టెక్స్‌టైల్ పార్కుకు తుది రూపం ఇవ్వాలని చెప్పారు. ప్రభుత్వ సలహాదారు బివి.పాపారావు, వరంగల్ ఎంపి కడియం శ్రీహరి, వర్ధన్నపేట ఎమ్మెల్యే ఆరూరి రమేష్, పరకాల ఎమ్మెల్యే ధర్మారెడ్డి, అధికారులతో కూడిన బృందం ఈ వారంలోనే సూరత్ పర్యటించి రావాలని, నెలాఖరులోగా నివేదిక ఇవ్వాలని కోరారు. ఒక్క వరంగల్ జిల్లా నుండే దాదాపు మూడు లక్షల మంది సూరత్‌కు వెళ్లి మగ్గాలపై వస్త్రాలు తయారు చేస్తున్నారన్నారు. తెలంగాణ వ్యాప్తంగా కూడా ఇతర ప్రాంతాలకు వెళ్లి టెక్స్‌టైల్ పరిశ్రమలో పనిచేస్తున్నవారు ఉన్నారని, వారంతా నైపుణ్యం, అనుభవం సంపాదించారని, అలాంటి వారిని ఉపయోగించుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. సూరత్‌లో చీరలు, సల్వార్ లాంటి ఉత్పత్తులు ఎక్కువగా ఉంటాయని, షోలాపూర్‌లో నాణ్యమైన చద్దర్లు తయారవుతాయని, తిర్పూర్‌లో డ్రస్ మెటీరియల్ ఎక్కువగా ఉత్పత్తి అవుతుందని సిఎం అన్నారు. ఈ మూడు రకాల ఉత్పత్తులతో పాటు మిగతా అన్ని రకాల వస్త్ర సంబంధ ఉత్పత్తులు వరంగల్‌లోనే తయారు కావాలని ముఖ్యమంత్రి అన్నారు. అందుకు అనువైన పరిశ్రమలను స్థాపించడం ప్రభుత్వ ఉద్దేశమన్నారు. ఈ రంగంపై ఆధారపడిన వారు ఇక్కడే పనిచేసుకొని బతకాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. వరంగల్ నగరం చుట్టూ ఇప్పటికే ప్రభుత్వ భూములు సేకరించి పెట్టామని, వాటిలో టెక్స్‌టైల్ పార్క్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. నాణ్యమైన వస్తువులను విక్రయించడానికి అనువుగా వరంగల్ నగరంలోనే స్టాల్స్ ఏర్పాటు చేయడానికి మార్కెట్ నిర్మిస్తామని కూడా వెల్లడించారు.

---

సిపిఆర్ఓ టు సిఎం